క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు అవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెనాలికి చెందిన కె.సుబ్బారావు(68)తన మనవడు ప్రవీణ్ కలిసి తాడేపల్లి నుంచి కంకిపాడులో కోడి పందేలు చూడటానికి బుధవారం బైక్‌పై వచ్చారు. వారు కోడి పందేలు చూసి తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న బైక్ గంగూరు వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన మరో బైక్ వారిని ఢీ కొట్టి ఆగకుండా వెళ్లింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న కె.సుబ్బారావు, ప్రవీణ్ రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో సుబ్బారావుకు గాయాలవ్వటంతో అతనిని విజయవాడలో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు నున్నలో ఎమ్మెల్యే యార్లగడ్డ పర్యటన

నున్న(విజయవాడరూరల్): ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ 18వ తేదీ (శనివారం) రానున్నట్లు ఎంపీడీఓ బి.విగ్గిన్స్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో పంచాయతీ నిధులు రూ.52లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవం, అనంతరం కోటకట్ట సెంటర్ నుంచి బీసీ శ్మశానవాటిక వరకు జాతీయ ఉపాధి నిధులు రూ.14లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవం కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరవుతున్నారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని ఆయన చెప్పారు.

వక్ఫ్ భూములకు కౌలు వేలం నిర్వహించాలి

పెనమలూరు: తాడిగడపలో ఉన్న వక్ఫ్ భూముల వేలంపాట ప్రభుత్వం వెంటనే నిర్వహించి ముస్లింలకు న్యాయం చేయాలని ఏపీ బీసీ వెల్ఫేర్ మైనార్టీ అధ్యక్షుడు అసిఫ్‌పాషా అన్నారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ తాడిగడపలో వక్ఫ్ భూములు మొత్తం 42.86 ఎకరాలు ఉందన్నారు. ఈ భూములు ఒక వ్యక్తికి లీజు ఇవ్వగా గత 15ఏళ్లుగా లీజు సొమ్ము ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. లీజు బకాయి రూ. కోట్లలో ఉందన్నారు. జిల్లా వక్ఫ్ ఆడిట్ ఇన్‌స్పెక్టర్, ఖాజీ లీజు దారులతో మిలాఖాత్ అయ్యి వక్ఫ్ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. ఇకనైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఖాజీ, వక్ఫ్ అధికారుల పాత్రపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అద్దె చెల్లించని లీజు దారుడిని ఖాళీ చేయించి వెంటనే లీజు పెట్టాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు.. మంత్రి సాయం



హనుమాన్‌జంక్షన్ రూరల్: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై బాపులపాడు మండలం బొమ్ములూరు టోల్‌ప్లాజా సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళగా తీవ్రంగా గాయపడింది. ఘటన జరిగిన సమయంలో అదే రోడ్డు మార్గంలో వెళ్తున్న రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గాయపడిన మహిళ బాపులపాడు మండలం కోడూరుపాడుకు చెందిన కె.శిరీషను హుటాహుటిన తన కాన్వాయ్‌లోని వాహనంలో చిన్నవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రురాలితో పాటుగా సిబ్బందిని ఆస్పత్రికి పంపి, వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాల్సిందిగా సూచించారు.

7 నుంచి దత్తసాయి మందిర వార్షికోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు మందిరం 10వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ ఉదయం 5.15 గంటలకు కాగడ హారతితో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. 7 గంటలకు విఘ్నేశ్వర పూజ, బాబావారికి అభిషేకం, ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి అఖండ తారక నామ మహా మంత్రం పారాయణం, సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం కోలాటం జరుగుతుందన్నారు. 8న మధురానగర్ వీధులలో బాబావారి భిక్ష సేకరణ, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. 9వ తేదీ ఆదివారం బాబావారికి 21 దివ్య ద్రవ్యాలతో అభిషేకం, మధ్యాహ్నం అన్నాభిషేకం నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామని చెప్పారు. శ్రీ సాయినక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం, లోక కల్యాణార్థం లక్ష్మీగణపతి హోమం జరుగుతుందన్నారు. మందిర వార్షికోత్సవాల్లో భక్తులు పాల్గొని బాబావారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

అతీగతీ లేని టెన్నిస్ కోర్టు

- పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం
- అందుబాటులోకి రాని క్రీడా ప్రాంగణం
- ధ్వంసమైపోతున్న టెన్నిస్‌కోర్టు పరిసరాలు



ఈడుపుగల్లులో ఏర్పాటు చేసిన టెన్నిస్ కోర్టు ఇదే



నిర్లక్ష్యం కారణంగా అధ్వానంగా ఉన్న ప్రాంగణం

కంకిపాడు: పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది టెన్నిస్ కోర్టు. దశాబ్దంపైగా కావస్తున్నా నేటికీ క్రీడాకారులకు అందుబాటులోకి రాలేదు. కాలక్రమేణా టెన్నిస్‌కోర్టు బోర్డు, ప్రాంగణం సైతం ధ్వంసమవుతున్నాయి. ఉన్నత లక్ష్యంతో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసినా వినియోగంలోకి రాకపోవటం పట్ల ప్రజలు, క్రీడాకారులు పెదవి విరుస్తున్నారు.

ఈడుపుగల్లు కేంద్రంగా..

2010లో జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి ఈడుపుగల్లు పాఠశాల ప్రాంగణంలో సభ నిర్వహించారు. గ్రామస్తులు తమకు స్విమ్మింగ్ పూల్ మంజూరు చేయాలని కోరారు. దీంతో స్పందించిన అప్పటి ప్రభుత్వం జిల్లా పరిషత్ పాఠశాలలో కొంత స్థలాన్ని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థకు మళ్లించి అందులో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసింది. జిల్లా క్రీడా ప్రాధికారసంస్థ పర్యవేక్షణలో స్విమ్మింగ్ పూల్ ఉంది. రెండు సంవత్సరాల క్రితం నిర్వహణాపరమైన సమస్యలతో స్విమ్మింగ్ పూల్‌ను అధికారులు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. స్విమ్మింగ్ పూల్ నిర్మాణం జరిగిన స్థలం పోనూ మిగిలిన స్థలాన్ని టెన్నిస్‌కోర్టుగా మార్చారు. ఎంతో ఆకర్షణీయంగా బోర్డులు ఏర్పాటు చేసి ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. కోర్టు ఏర్పాటుకు అవసరమైన మ్యాట్‌లు మాత్రమే ఏర్పాటు చేయాల్సి ఉంది.

అభివృద్ధి గాలికి..

తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ స్విమ్మింగ్ పూల్, టెన్నిస్‌కోర్టు ప్రాంగణం అభివృద్ధి అంశాన్ని వదిలేసింది. టెన్నిస్‌కోర్టు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చొరవ చూపలేదన్న విమర్శలు ఉన్నాయి. తరువాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న కొలుసు పార్థసారథి పలుమార్లు సిమ్మింగ్ పూల్‌ను సందర్శించి క్రీడాకారులకు చేయూతగా నిలవాలని ఆదేశించారు. టెన్నిస్ కోర్టుపై సమీక్షలు, సమాలోచనలు చేశారు. అయితే సమస్య అపరిష్కృతంగానే ఉంది.

అధ్వానంగా మారుతున్న పరిసరాలు..

టెన్నిస్‌కోర్టు ప్రాంగణం అధ్వానంగా మారుతోంది. కోర్టు ప్రాంగణంలోకి వెళ్లేందుకు ఆకర్షణీయమైన బోర్డు, భారీ గేటు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బోర్డు పూర్తిగా ధ్వంసమైంది. గేటు పరిసరాల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి అధ్వానంగా తయారైంది. టెన్నిస్‌కోర్టు ప్రాంగణం కూడా అదే పరిస్థితి. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారికి అనుకుని ఉన్న విలువైన స్థలంలో టెన్నిస్ కోర్టు ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు, ఔత్సాహికులు ఇక్కడికి వచ్చి శిక్షణ పొందేందుకు ఆస్కారం ఉంటుంది. కానీ ఆ దిశగా చర్యలు లేవు. ఫలితంగా టెన్నిస్‌కోర్టు ఉన్నా వినియోగానికి దూరంగా ఉంది. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ప్రతినిధులు టెన్నిస్‌కోర్టుకు వినియోగంలోకి తెచ్చి క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించాల్సిన అవసరం ఉంది.

పెనమలూరులో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్

- భవన నిర్మాణం పూర్తి
- పరికరాలు అందుబాటులోకి వస్తే త్వరలో ప్రారంభం



పెనమలూరులో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్

పెనమలూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణం పూర్తయ్యింది. వివిధ రకాల వైద్య పరీక్షలకు సంబంధించి అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవం కలిగిన సిబ్బందిని నియమించాల్సి ఉంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలో ప్రజలకు అన్నిరకాల వైద్య పరీక్షలకు మైక్రో బయాలజీ ల్యాబ్ పెనమలూరు పీహెచ్‌సీలో ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) 15వ ఫైనాన్స్ హెల్త్ గ్రాంట్స్ రూ. 50 లక్షల నిధులతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. గత ఆగస్టులో భవన నిర్మాణానికి పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో శంకుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణం పూర్తి కాగా అందులో త్వరలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను ప్రారంభించనున్నారు.

అన్ని రకాల వైద్య పరీక్షలు..

మైక్రో బయోలాజికల్ ల్యాబ్ ద్వారా ఇక్కడ సేవలు అందించనున్నారు. బీపీ, సుగర్, వివిధ రకాల రక్త పరీక్షలు, థైరాయిడ్, లివర్, కిడ్నీ ఇలా అన్నిరకాల పరీక్షలు ఇక్కడే చేస్తారు. దీని వల్ల పేషెంట్ ఎటువంటి వ్యాధితో ఇబ్బంది పడుతున్నారనే విషయం నిర్ధారణ అవుతుంది. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ద్వారా పేషెంట్‌కు కచ్చితంగా వ్యాధి నిర్ధారణ చేయగలుగుతారు. పరీక్షలు చేసిన తరువాత వచ్చే రిపోర్టు ఆధారంగా వైద్యులు పూర్తి అవగాహనతో నాణ్యమైన వైద్యం అందించటానికి ఆస్కారం ఉంటుంది.

పూర్తి స్థాయిలో సేవలు అందుతాయా?

కాగా నేషనల్ హెల్త్ మిషన్ ముందుకు వచ్చి రూ. 50 లక్షలు నిధులు కేటాయించటంతో సకాలంలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణం పూర్తి చేశారు. అయితే అన్ని వైద్య పరీక్షలకు సంబంధించి ఆధునిక వైద్య పరీక్ష పరికరాలు ఇక్కడ ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకు రావల్సి ఉంది. వైద్య పరికరాలు, అనుభవం కలిగిన ప్యాథాలజీ, మైక్రోబయోలజీ, ల్యాబ్ టెక్నిషియన్స్, ఇతర అనుభవం కలిగిన సిబ్బందిని నియమించాల్సి ఉంది. అయితే పరికరాలు, అనుభవం కలిగిన సిబ్బంది నియామకం ఇంకా జరగలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం ప్రారంభించిన వెంటనే పూర్తి స్థాయిలో సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కనులపండువగా గ్రామోత్సవం



కాల్వగట్టు ప్రాంతంలో సాగుతున్న అమ్మవారి గ్రామోత్సవం

రామవరప్పాడు: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని ముగ్గురమ్మలతో జరుగుతున్న గ్రామోత్సవం భక్తులతో అడుగడుగునా నీరాజనాలు అందుకుంటోంది. గత మూడు రోజులుగా రామవరప్పాడు ప్రధాన గ్రామంతో పాటు పురవీధుల్లో అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా జరుగుతోంది. ప్రస్తుతం కాల్వగట్టు ప్రాంతం దూపాళ్ల కట్టపై అమ్మవారు పూజలు అందుకుంటోంది. భక్తులు అమ్మవారి రథాన్ని అనుసరిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలువురు మహిళలు ఉత్సవ వాహనం ఎదుట పసుపు నీళ్లు పోసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. అమ్మవార్ల గ్రామోత్సవం కనులారా వీక్షించేందుకు భారీ సంఖ్యలో పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. నిరాటంకంగా జరుగుతున్న గ్రామోత్సవం రామవరప్పాడులో పూర్తయిన తర్వాత ప్రసాదంపాడులో ప్రారంభమవుతుంది.

వీఓఏల ఆకలి కేకలు

- చిరుద్యోగుల సంక్షేమంపై కూటమి సర్కారు నిర్లక్ష్యం
- ఆర్నెల్లుగా ఉద్యోగులకు అందని జీతాలు
- కుటుంబాలు గడవక నానా అవస్థలు
- పనిభారం, రాజకీయపరమైన ఒత్తిళ్లతో సతమతం
- పెద్ద పండుగ పూటా తప్పని పస్తులు

కంకిపాడు: చిరుద్యోగుల సంక్షేమాన్ని కూటమి సర్కారు పూర్తిగా వదిలేసింది. వేతనాల విడుదలలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో పడటంతో కుటుంబాలు గడవక వెలుగు వీఓఏలు అవస్థలు పడుతున్నారు. సంక్రాంతి పెద్ద పండుగ వచ్చి పోయినా జీతాలందక పండుగ పూటా పస్తులు తప్పలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

1105 మంది వెలుగు వీఓఏల వ్యథ

డీఆర్‌డీఏలో కృష్ణాజిల్లా వ్యాప్తంగా డ్వాక్రా సంఘాల సహాయకులుగా పనిచేస్తున్న వీఓఏలు (గ్రామైక్య సంఘాలు) 1105 మంది ఉన్నారు. 25 మండల సమాఖ్యలు ఉన్నాయి. జిల్లాలో 29,582 డ్వాక్రా పొదుపు సంఘాలు ఉన్నాయి. వీటిలో 3,04,584 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 1105 మంది వెలుగు వీఓఏలు ఉన్నారు. పొదుపు సంఘాల నిర్వహణ, సభ్యులకు రుణాలు అందజేత, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల లబ్ధి చేకూర్చటంలోనూ వీఓఏలదే కీలకపాత్ర. ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా ఉంటూ బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, ఇతర అనేక రుణ సదుపాయాలను అర్హులకు అందించటంలో ప్రధాన పాత్ర పోషిస్తుంటారు. ఇందుకు గానూ ప్రతినెలా వీఓఏకి రూ.8 వేలు, గ్రామైక్య సంఘం నుంచి రూ.2 వేలు చొప్పున జీతం అందజేస్తున్నారు. ఒకప్పుడు రూ.3 వేలుగా ఉన్న వేతనాన్ని రూ.8 వేలకు పెంచిన ఘనత కూడా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే. ఈ చర్యతో వీఓఏలకు ఆర్థిక భరోసా చేకూరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీఓఏల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గతేడాది జూలై నుంచి డిసెంబరు వరకూ ఆర్నెల్ల జీతాలు వీఓఏలకు ఇంతవరకు అందలేదు. జీతాలు అందకపోగా సమీక్షలు, సమావేశాలు, సంఘాల సభ్యులకు రుణాలు అందజేత సమయంలో అధికారుల సంతకాలు, సభ్యుల విచారణ కోసం కార్యాలయాలకు పిలిపించుకోవటం వంటి చర్యలతో వీఓఏలు రవాణా చార్జీలకే అధికమొత్తంలో సొమ్ము ఖర్చు చేయాల్సి వస్తోంది. పెద్ద పండుగకి కూడా చేతిలో చిల్లిగవ్వ లేక, కుటుంబ పోషణ భారంగా మారిందని పలువురు వీఓఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> పనిభారం, రాజకీయ ఒత్తిళ్లు అధికం

జీతాల సమస్యతో పాటు పనిభారం, రాజకీయపరమైన ఒత్తిళ్లు అధికమయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చాక అనేక ప్రాంతాల్లో వీఓఏలను తొలగించి తమ పార్టీకి చెందిన మహిళలను నియమించుకోవటానికి కూడా వెనుకాడటం లేదు. రాజకీయపరమైన సమావేశాలు, సభలకు మహిళలను తరలించటం కోసం వీఓఏలను ప్రధానంగా వినియోగిస్తున్నారు. కచ్చితంగా జనాన్ని తీసుకురావాల్సిందేనంటూ స్థానిక కూటమి నేతలు వీఓఏలపై హుకుం జారీ చేస్తూ పెత్తనాలు సాగిస్తున్నారు. కుటుంబ ఆర్థిక సర్వే పేరుతో ప్రతి ఒక్క కుటుంబం ఆర్థిక వివరాలను ఇప్పటికే సేకరించారు. వ్యాపారాలు సాగించే మహిళల జాబితాను సర్వే చేశారు. ఆర్థిక స్థితి సర్వే పేరుతో సంక్షేమ పథకాలకు పంగనామం పెట్టే యోచనలో కూటమి ఉందా? అన్న అనుమానాలకు తావిస్తోంది. పూటకో సర్వే, రోజుకో జాబితా రూపకల్పన, అధికారులకు అప్పగింత పేరుతో పనిభారం పడి వీఓఏలు అష్ట కష్టాలు ఎదుర్కొంటున్నారు.

జీతాలు ఇస్తేనే సమ్మె విరమిస్తాం



ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యాన్ డ్రైవర్లు

పెనమలూరు: తమకు జీతాలు ఇస్తేనే సమ్మె విరమించి విధుల్లోకి చేరుతామని చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లు స్పష్టం చేశారు. సమ్మెలో భాగంగా గురువారం ఎమ్మెల్యే బోడెప్రసాద్ చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యాన్ డ్రైవర్లు వివరాలు తెలుపుతూ గత మూడు నెలలుగా తమకు జీతాలు చెల్లించలేదన్నారు. ఈ విషయమై అనేక సార్లు తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్‌కు విన్నవించామన్నారు. జీతాలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు జీతాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సంక్రాంతి పండుగ కూడా చేసుకోలేక పోయామన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే చొరవ తీసుకోని తమకు న్యాయం చేయాలని కోరారు. మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, నేతలు షేక్ మస్తాన్‌వలి, నరసింహారావు, వి.సురేష్, కె.రాంబాబు, రవికుమార్, లింగయ్యగౌడ్, శ్రీహరి, సత్రం శీను పలువురు పాల్గొన్నారు.

యువతకు సంక్రాంతి సంబరాలు



విజేతకు బహుమతి అందిస్తున్న అతిథులు

పెనమలూరు: యువత చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా ఉండటానికి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని మండల సీపీఎం కార్యదర్శి షేక్.కాశిం అన్నారు. పోరంకి విజ్ఞాన్ భారత్ పాఠశాల ప్రాంగణంలో యువజన సంఘాలు, డీవైఎఫ్ఐ, ఐద్వా, ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించి బుధవారం రాత్రి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కాశిం మాట్లాడుతూ నేడు సంక్రాంతి సంబరాలంటే కోడిపందేలు, జూద క్రీడలుగా మారిందన్నారు. యువతను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. అయితే యువజన సంఘాల ఆధ్వర్యంలో తాము నిజమైన సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, రన్నింగ్, స్లో సైక్లింగ్, పలు ఆటల పోటీలు నిర్వహించామన్నారు. అలాగే సంప్రదాయంగా సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకునే విధంగా నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రొఫెసర్ కొడాలి రామశేషాద్రిరావు, నేతలు అనుమోలు ప్రభాకరరావు, ఉప్పాడ త్రిమూర్తి, పాతాళలక్ష్మి, మస్తాన్‌వలి, పి.లక్ష్మీనారాయణ, పి.కృష్ణ, వీసం సోమశేఖర్, పలువురు పాల్గొన్నారు.

కూటమిలో కుమ్ములాట

- సంక్రాంతి బరుల నిర్వహణపై విభేదాలు
- ఒక వర్గంపై మరో వర్గం ఫిర్యాదు
- జనసేన పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త సస్పెన్షన్
- తెలుగు తమ్ముళ్ల వ్యవహారంలోనూ ఇదే తీరు



కంకిపాడులో జనసేన ఏర్పాటుచేసిన సంక్రాంతి బరి (ఫైల్)

కంకిపాడు: కూటమిలో సంక్రాంతి బరుల లొల్లి తారస్థాయికి చేరింది. నిబంధనలు, విధి విధానాలకు విరుద్ధంగా బరులు నిర్వహించారంటూ జనసేన పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజాను సస్పెండ్ చేస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీలోని మరో వర్గం ఇందులో ముఖ్యభూమిక పోషించిందనే ప్రచారం ఆ వర్గాల్లో సాగుతోంది. మరో వైపు టీడీపీ నేతృత్వంలో ఏర్పాటైన బరుల్లో నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరించటం, దాడులకు తెగబడటంపై అధిష్ఠానానికి స్థానిక నేతల నుంచి ఫిర్యాదులు వెళ్లాయన్న చర్చ బహిరంగంగా సాగుతోంది.

ముప్పా రాజా సస్పెన్షన్..

సంక్రాంతి పండుగ సందర్భంగా కంకిపాడు బైపాస్ మార్గం వెంబడి జనసేన ఆధ్వర్యంలో సంక్రాంతి బరి ఏర్పాటు చేశారు. మూడు రోజులు పాటు కోడిపందేలు, జూదం జరిపించారు. దీంతో పాటుగా ప్రధాన రహదారిపై వాహనాల పార్కింగ్‌కు ఫీజులు వసూలు చేయటంతో స్థానికంగా ఉన్న కొందరు ఆ పార్టీ నేతలు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పార్టీ విధి విధానాలకు విరుద్ధంగా బరి ఏర్పాటు చేయటం, జెండాలు, బ్యానర్లు ఏర్పాటు చేయటాన్ని ఆ పార్టీ అధిష్ఠానం సరికాదని పేర్కొంటూ నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న ముప్పా రాజాను సస్పెండ్ చేసింది.


టీడీపీ బరుల్లో అంతా ఇష్టారాజ్యం..

టీడీపీ నేతృత్వంలో ఏర్పాటైన బరులపైనా విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. బరుల నిర్వహణలో ఎవరికి వారే వ్యవహరించారు. బరుల వద్దకు వచ్చిన వీక్షకులను సైతం తమ అహంకార పూరిత ధోరణితో దుర్భాషలాడటం, ఘర్షణలకు దిగిన ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సంబరాల తీరునే మార్చేశారు. పందేలు, జూదం యథేచ్ఛగా అర్ధరాత్రులు కూడా కొనసాగించారు. బరుల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వకపోవటంతో కొందరు స్థానిక నేతలు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. నిర్వాహకులుగా ఉన్న కొందరు నేతల తీరుపై పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి. నియోజకవర్గ ముఖ్యప్రజాప్రతినిధికి సైతం ఈ నేతల తీరుపై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఆ నేతలపై క్రమశిక్షణ చర్యలు కోసం అధిష్ఠానానికి కూడా ఫిర్యాదులు పంపారు. ఇదే తీరు కొనసాగితే పార్టీలో కొనసాగటం తమకు ఇబ్బందేనంటూ చెబుతున్నవాళ్లు ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో ఐదో తరగతి అడ్మిషన్ల కోసం ఈ నెల 18వ తేదీన నిర్వహించబోయే జేఎన్‌వీ ఎంట్రన్స్ టెస్ట్-2025కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు గురువారం విలేకరులకు తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 5,788 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నారని చెప్పారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేశామన్నారు. హాల్‌టికెట్ల జారీలో అభ్యర్థులకు ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు సూచించారు. 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని ఆయన చెప్పారు. ప్రవేశ పరీక్ష ఫలితాల ఆధారంగానే సీట్ల కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు.


కొనసాగుతున్న భక్తుల రద్దీ



ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి వర్ధంతి మహోత్సవాలు బుధవారంతో ముగిసినప్పటికీ గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి తంబి సమాధిని దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం వరకు ఈ రద్దీ కొనసాగుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. – ఉంగుటూరు

సచివాలయ ఉద్యోగుల వర్గీకరణపై పునరాలోచించాలి

గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అర్లయ్య



భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులను మూడు కేటగిరీలుగా వర్గీకరించాలని తీసుకున్న నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని ఏపీ గ్రామ/వార్డ్ సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్య ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇటువంటి నిర్ణయాలు తీసుకుని అమలు చేసే ముందు ఉద్యోగ సంఘాల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయంతో సచివాలయ ఉద్యోగులు వివిధ రూపాల్లో కష్టనష్టాలను ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు. సచివాలయ ఉద్యోగుల వర్గీకరణకు సంబంధించి మార్గదర్శకాల కోసం ముగ్గురు సభ్యులతో ఏర్పాటు చేస్తామన్న కమిటీని నియమించారా లేదా, ఏర్పాటై ఉంటే అందులో సభ్యులుగా ఎవరెవరు ఉన్నారనే దానిపై కూడా ఉద్యోగులు, నేతలకు సమాచారం లేదన్నారు. తమ విభాగంలో చేపట్టనున్న మార్పులు, చేర్పులపై ఉద్యోగ సంఘాల నేతలతో కమిటీ సభ్యుల సమావేశం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ అంశంపై ప్రభుత్వంతోపాటు సంబంధిత మంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గన్నవరం: స్థానిక బుద్ధవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా భవనంలో శుక్రవారం ఉచిత దంత, నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గన్నవరం తాలూకా అధ్యక్షుడు అవుటపల్లి మోహన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన మాక్సివిజన్ ఐ హాస్పిటల్, కృష్ణసాయి దంత వైద్యశాల డాక్టర్ల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు.